క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం



అవార్డు గ్రహీత సత్యనారాయణ సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

బిక్కవోలు: ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన బిక్కవోలు మండలానికి చెందిన పితాని సత్యనారాయణను ఎస్టీయూ సభ్యులు ఘనంగా సత్కరించారు. రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన ఎస్టీయూ జిల్లా కార్యవర్గం సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దానియేల్‌బాబు ఆధ్వర్యంలో సత్యనారాయణను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ సభ్యుడు తమలంపూడి ఈశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జెంగా శ్రీనువాస్ ప్రసాద్, బిక్కవోలు మండల ఎస్టీయూ అధ్యక్షుడు ఎన్.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ద్వారంపూడి సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

రంగంపేట: విజయవాడలోని వరద బాధితులను ఆదుకోవడానికి స్థానిక శ్రీభారతి యూపీ స్కూల్ విద్యార్థులు ముందుకొచ్చారు. పాఠశాల విద్యార్థులు కరస్పాండెంట్ నందిగాం ఉమామణి అనుమతితో గ్రామంలో జోలిపట్టి రూ.31,984 వసూలు చేశారు. ఈ మొత్తాన్ని డీడీ రూపంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి అందించి ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించాలని కోరారు. సేవాభావం చాటిన విద్యార్థులను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అభినందించారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ నందిగాం శశిప్రీతం, హెచ్‌ఎం.మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, అమ్మవార్లు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మినీ, సొంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

10న ఆర్టీసీ పార్శిల్ కార్యాలయంలో వేలం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ఆర్టీసీ పార్శిల్ ఆఫీస్‌లో అన్‌క్లెయిమ్డ్, అన్ ఐడెంటిఫైడ్ వస్తువులకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(కమర్షియల్) మాధవ్ ఆదివారం ప్రకటించారు. రాజమహేంద్రవరం బస్‌స్టేషన్‌లో ఉన్న పార్శిల్ బుకింగ్ ఆఫీస్ వద్ద మంగళవారం ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు బహిరంగ వేలంలో పాల్గొని వస్తువులను సొంతం చేసుకోవచ్చునన్నారు.

నూతన భవన నిర్మాణం అభినందనీయం

రాజమహేంద్రవరం సిటీ: దశాబ్దాల చరిత్ర కలిగిన ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్‌కు నూతన భవనాన్ని నిర్మించుకోవడం అభినందనీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం మెయిన్ రోడ్‌లో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన భవన ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కిర్లంపూడి: భారీ వర్షాల నేపథ్యంలో ఏటిపట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సూచించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏలేరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో అధికంగా ఉండటంతో సుమారు 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. నీరు విడుదల చేస్తే కిర్లంపూడి మండలంలోని లోతట్టు గ్రామాలు నీట మునిగే ప్రమాదం ఉందన్నారు. ఈ మేరకు ఏలేరు కాలువను ఆనుకొని లోతట్టు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి, వారికి అన్ని వసతులు కల్పించాలని ఉన్నతాధికారులను కోరినట్టు తెలిపారు.

జై జై గణేశా..

- వైభవంగా వినాయక చవితి వేడుకలు
- వీధివీధినా వెలసిన బొజ్జగణపయ్య ప్రతిమలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బిక్కవోలు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన స్థానిక స్వయంభూ శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరిగాయి. శనివారం తెల్లవారుజామున తీర్థపు బిందె సేవతో వేడుకలను ప్రారంభించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఉదయం 10.29 గంటలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు కలశస్థాపన చేశారు. జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

వాడవాడలా వేడుకలు

మండలంలోని వాడవాడలా మండపాలను ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో బొజ్జగణపయ్య ప్రతిమలను ప్రతిష్ఠించారు. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. భక్తులు పాళిలను రకరకాల పండ్లు, పువ్వులు, పత్రిలతో ఆలంకరించి వినాయకుని ప్రతిమల వద్ద కట్టారు. స్వామివారికి ప్రసాదాలు, కుడుములు, ఉండ్రాళ్లతో ప్రత్యేక పూజలు చేశారు. పందలపాక, బలభద్రపురం, తొస్సిపూడి, కొమరిపాలెం, కొంకుదురు, ఊలపల్లి తదితర గ్రామాల్లో వేడుకలు వైభవంగా జరిగాయి.

రంగంపేట మండలంలో...

రంగంపేట: మండల వ్యాప్తంగా శనివారం వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లో వాడవాడలా వినాయక ప్రతిమలను నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లమిల్లి గ్రామ శివారున పొలాల్లో సహజ సిద్ధం ఏర్పడిన గణపతి రాతి విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ మట్టా శ్రీను ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా గ్రామగ్రామన సందడి వాతావరణం నెలకొంది.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

పెదపూడి: మండలంలో వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో గణనాథుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రధానంగా జి.మామిడాడ, పెదపూడి, రామేశ్వరం, ఏపీత్రయం, పెద్దాడ, సంపర, కాండ్రేగుల గ్రామాల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించి ప్రతిష్ఠించారు. భక్తులు తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించి వీధుల్లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని ప్రతిమల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లెలు గణేశ్ నామస్మరణతో మారుమోగాయి. ప్రధాన కూడల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన ఆలయాలకు సుమారు వంద మీటర్ల వరకూ విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: స్థానిక కమ్మ వారి దిమ్మ వద్ద ప్రతిష్ఠించిన వినాయకుని విగ్రహానికి పెండ్యాల వెంకటేశ్వరరావు, సుజాత దంపతులు, సూదిన విశ్వేశ్వరరావు, శ్రీదేవి దంపతులు, ఘంటా సత్తిబాబు,నాగమణి దంపతులు, ఘంటా వెంకటేష్, మాధురి దంపతులు, కోడేబత్తుల రత్నాజీ, రామసీత దంపతులు, కాండ్రు వీరన్న, పుష్పావతి దంపతులు పూజలు చేశారు. అలాగే శ్రీదుర్గా భవాని వర్కర్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సీతానగరం బస్టాండ్ సెంటర్ వద్ద గణపతి విగ్రహాన్ని నెలకొల్పారు. యూనియన్ అధ్యక్షుడు కుంచె అచ్యుత రామారావు, గౌరవాధ్యక్షుడు చిడిపి బంగారయ్య, ఉపాధ్యక్షుడు షేక్ అమేజాన్, కార్యదర్శి గొల్లపల్లి కృష్ణ, మాజీ అధ్యక్షుడు గంగాధర్ తదితరులు పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని చినకొండేపూడి, సీతానగరం, వంగలపూడి, సింగవరం, రామచంద్రపురం, పురుషోత్తపట్నం, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, బొబ్బిల్లంక, జాలిమూడి, ములకల్లంక, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, కూనవరం, నాగంపల్లి, చీపురుపల్లి గ్రామాల్లో గణపతి నవరాత్రుల సందర్భంగా విగ్రహాలను ఏర్పాటు చేశారు.

వినాయక చవితి వేడుకలు వైభవంగా నిర్వహించాలి

పెదపూడి: గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సూచించారు. అనపర్తిలోని స్నేహ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక, మార్కేండేయపురంలోని గణపతి విగ్రహాలను ఆయన దర్శించుకున్నారు. గ్రామాల్లో పలు వినాయక మంటపాల్లో గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా ఆనందోత్సాహాల నడుమ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్తి రామకృష్ణారెడ్డి, తేతలి బుల్లియ్య, శంకర్‌బాబు, కానూరి కృష్ణ, కేతా దుర్గా ప్రసాద్, చింతా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



అనపర్తిలో స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



జి.మామిడాడలో గణపతిని ఊరేగిస్తున్న యువకులు

115 గణేశ్ పందిళ్లకు అనుమతి

మధురపూడి: కోరుకొండ మండలంలోని 20 పంచాయతీల్లో 115 వినాయక చవితి ఉత్సవ పందిళ్లకు అనుమతులిచ్చినట్టు కోరుకొండ తహసీల్దార్ సుస్వాగతం తెలిపారు. ఆదివారం తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ, నిబంధనల మేరకు నిర్వాహకులు వ్యవహరించాలని స్పష్టం చేశారు. భారీ సౌండ్ సిస్టం ఏర్పాటు చేయరాదని, రాత్రివేళ మైక్ ద్వారా ప్రజలకు అసౌకర్యం కలిగించరాదని చెప్పారు. నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్ణయించిన తేదీల్లో, ప్రకటించిన సమయానికి నిర్వహించాలన్నారు. చవితి పందిళ్ల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉత్సవ కమిటీలకు ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు.



పందలపాక వెలమపేటలో స్వామివారిని దర్శించుకుంటున్న చిన్నారులు

పాడి రైతులకు కొండంత అండ

- పశుధాన్ కిసాన్ క్రెడిట్ కార్డులతో అన్నదాతలకు మేలు
- బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం
- సక్రమంగా వినియోగించుకుంటే బహుళ ప్రయోజనాలు

రాజానగరం: పశు సంపద అన్నదాతలకు ఆది నుంచి చేదోడు, వాదోడుగా నిలుస్తోంది. వ్యవసాయపరంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా, అదనపు ఆదాయ సముపార్జనలో పాడి పశువులు మాత్రం నేటికీ రైతన్నలకు ఉపయోగపడుతూనే ఉన్నాయి. పూర్వం రైతులందరికీ పాడి పశువులు ఉండేవి. ఆధునిక సమాజంలో వాటి ప్రాధాన్యం తగ్గిపోతూ వస్తోంది. ప్రస్తుతం ఖర్చులు పెరిగిపోవడంతో రైతులు పశుపోషణకు దూరంగా ఉంటున్నారు. పాడి పరిశ్రమ వైపు రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పశుధాన్ కిసాన్ క్రెడిట్ కార్డు (పీకేసీసీ) పథకాన్ని తీసుకువచ్చింది.

రుణాలు, నేరుగా పశువులను కొనుగోలు చేసే అవకాశం

పశుధాన్ కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా ఆసక్తి ఉన్న రైతులు పశువుల కొనుగోలుకు బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికి, నేరుగా పశువులను కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. ఇందుకుగాను ఆయా రైతులు సమీపంలోని పశు సంవర్ధక శాఖ గ్రామ సహాయకుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారికి ఆయా బ్యాంకులు పశుధాన్ కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేస్తాయి. ఈ విధంగా కార్డు పొందిన రైతు ఆయా బ్యాంకు నుంచి రూ.1.60 లక్షల వరకూ రుణాన్ని పొందవచ్చు. గతేడాది ప్రతి మండలంలో వెయ్యి మందికి ఈ విధంగా పశుధాన్ కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేశారు. ఈ కార్డులు పొందిన రైతులు అవసరమైన సమయంలో నగదును తీసుకోవచ్చు. పశువుల కొనుగోలు, పశువుల పోషణ, మున్నగు వాటికి ఆయా సొమ్ములను వినియోగించవలసి ఉంటుంది. తీసుకున్న సొమ్ములను 40 రోజుల్లోగా తిరిగి చెల్లిస్తే ఎటువంటి వడ్డీ ఉండదు. 40 రోజులు దాటితే నిబంధనల మేరకు వడ్డీని చెల్లించాలి. దీనిలో 3 శాతం సొమ్మును ప్రభుత్వం రాయితీగా చెల్లిస్తోంది. ఒకరకంగా చెప్పాలంటే ఈ కార్డును సాధారణ క్రెడిట్ కార్డు మాదిరిగా వినియోగించుకుంటూ ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసుకోవచ్చు.



పాడి పశువులు

రైతులకు అనేక ప్రయోజనాలు



పాడి పశువులు ఉన్న రైతులకు బ్యాంకుల ద్వారా ఇచ్చే పశుధాన్ కిసాన్ క్రెడిట్ కార్డు (పీకేసీసీ)లను సక్రమంగా వినియోగించుకుంటే అనేక ప్రయోజనాలు పొందవచ్చు. రుణాలు తీసుకుని నేరుగా పాడి పశువులను కొనుగోలు చేసుకోవచ్చు. అనంతరం వాటి ద్వారా వచ్చే పాల దిగుబడితో ఆయా రుణాలను వాయిదాలలో తీర్చడానికి అవకాశం ఉంటుంది. నిరంతరం జరిగే ఈ ప్రక్రియను ఉపయోగించుకోవాలనుకునే రైతులు ముందుగా సమీపంలోని పశువైద్య కేంద్రంలో అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలి. రైతుల ఆర్థిక పరిస్థితులు, గతంలో వారు తీసుకున్న రుణాలు, చెల్లింపులను పరిశీలించి ఆయా బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి.

–డాక్టర్ ఎంఎస్ఎన్ మూర్తి, పశుసంవర్ధక శాఖ, సహాయ సంచాకులు, రాజానగరం

క్రెడిట్ కార్డులిస్తే మంచిదే



పాడి సంపద వృద్ధి చెందడానికి, రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి పశుధాన్ కిసాన్ క్రెడిట్ కార్డులు ఉపయోగపడతాయి. ప్రభుత్వం చెప్పినంతగా బ్యాంకుల నుంచి సహకారం ఉండటం లేదు. దరఖాస్తు చేసుకున్న రైతుల ఆర్థిక పరిస్థితిపై విచారణ చేసి కార్డులు ఇస్తున్నారు. దీనివలన సన్న, చిన్నకారు రైతులకు పెద్దగా ప్రయోజనం కలగడం లేదు.

సత్తి త్రిమూర్తులు, రైతు, ముక్కినాడపాకలు

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

జిల్లా ఎస్పీ నరసింహకిషోర్



హైవేపై జీఎస్ఎల్ వైద్య కళాశాల ఎదురుగా యాక్సిడెంట్ బ్లాక్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, తదితరులు

రాజానగరం: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ డి. నరసింహకిషోర్ తెలిపారు. జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లోని యాక్సిడెంట్ బ్లాక్స్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యల పై చర్చించారు. కార్యక్రమంలో సీఐలు ఎ.శ్రీనివాసరావు, పి.వీరయ్యగౌడ్, ఎస్సైలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ఉమెన్స్ కాలేజ్ సమీపంలో జిల్లా ఈఓ, సూపర్‌వైజర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీకాంత్‌రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా బి.వరలక్ష్మి, జిల్లా సెక్రటరీగా యు.పద్మ, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌రాజు మాట్లాడుతూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు చెందిన అనేక సమస్యలు పేరుకుపోయి అపరిష్కృతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఐసీడీఎస్ సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ మాట్లాడుతూ ఐసీడీఎస్‌లో బదిలీలు లేనందున అవసరమైన వారికి డిప్యుటేషన్లకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ప్రకాష్ కుమారి, జిల్లా అధ్యక్షురాలు కె.పద్మావతి పాల్గొన్నారు.

ప్రహసనంగా ఉపాధ్యాయుల పని సర్దుబాటు

కంబాలచెరువు(కంబాలచెరువు): ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ ఒక ప్రహసనంగా మారిందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.జయశంకర్ అన్నారు. యూటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జయశంకర్ మాట్లాడుతూ మొత్తం ప్రక్రియ రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలో కేంద్రీకృతం చేసి ఆన్‌లైన్ చేయడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉత్తమ బోధనా పద్ధతులను అందిపుచ్చుకుని విద్య బోధన చేయడమే కాకుండా దేశ స్థితిగతులను మార్చే విద్యార్థులను తయారు చేసే విధంగా ఉండాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణకుమారి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ నిరంతరం సర్దుబాటు ప్రక్రియలో ఉన్న ఇబ్బందులను తొలగించడానికి కృషి చేస్తుందన్నారు. ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలని, జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహాధ్యక్షులు ఐ.రాంబాబు, ఎం.విజయగౌరి, కోశాధికారి ఈవీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి ఎస్.రవిబాబు, రమేష్‌బాబు, దయానిధి, ఈ.శ్రీమణి, ప్రకాశరావు, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

జీవో నంబర్ 84ని రద్దు చేయాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జీవో నెంబర్ 84ని రద్దు చేసి, పాత విధానంలోనే మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు జరపాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా శాఖ రెండో కార్యవర్గ సమావేశాన్ని బుధవారం స్థానిక దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ 117 జీవో వల్ల విద్యా వ్యవస్థ నష్టపోతుందన్నారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తూ విద్యార్థుల సంఖ్య పెరగడానికి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. సీపీఎస్ స్థానంలో ఓపీఎస్‌ను తప్ప ఏ ఇతర ప్రత్యామ్నాయాలను ఉపాధ్యాయులు ఒప్పుకోరని ఆయన స్పష్టం చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా జీతాలు క్రెడిట్ అయ్యేలా చేయడంలో ఎస్టీయూ కృషి చేసిందని ఆయన గుర్తు చేశారు. కోర్టులో ఉన్న పండిట్స్ వివాదాన్ని త్వరలో పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు స్వీకరించిన ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

శరన్నవరాత్ర ఉత్సవాలకు శ్రీకారం

కడియం: స్థానిక దేవి గుడి వద్ద ఆదివారం పందిరి రాట ముహూర్తం నిర్వహించి శరన్నవరాత్ర ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎప్పట్లాగే ఈ ఏడాది కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సమాయత్తమయ్యారు. కార్యక్రమంలో శ్రీవిఘ్నేశ్వర తాపీ పనివారల సంఘం సభ్యులు, దేవీ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీదేవి నవరాత్రులకు రాట ముహూర్తం

సీటీఆర్ఐ: రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచిన దేవిచౌక్ శ్రీబాలాత్రిపుర సుందరీ దేవి దసరా ఉత్సవాలకు సంబంధించి స్థానిక దేవిచౌక్ వద్ద ఆదివారం ఉదయం 7.28 గంటలకు రాట ముహూర్తం నిర్వహించారు. 91వ శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలకు రాట ముహూర్తంతో నాంది పలికారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దేవిచౌక్‌లో రాట ముహూర్తం నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సీఐగా కృష్ణభగవాన్ బాధ్యతల స్వీకరణ



సామర్లకోట: కొత్త సామర్లకోట పోలీస్‌స్టేషన్ సీఐగా ఎ.కృష్ణభగవాన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సీఐల బదిలీల్లో భాగంగా ఇప్పటివరకు పనిచేసిన డి సురేష్ బదిలీ కావడంతో, క్రైం సీఐగా ఉన్న అంకబాబును ఇక్కడ నియమించారు. మళ్లీ మూడు రోజుల్లోనే ఆయనను క్రైం సీఐగా పూర్వ స్థానానికి పంపారు. అప్పటి నుంచి సీఐ పోస్టు ఖాళీగా ఉండటంతో, కృష్ణభగవాన్‌ను నియమిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. గతంలో ఈయన పెద్దాపురం పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా పని చేశారు.

భయం గుప్పిట్లో ఏటిపట్టు గ్రామాలు

- ప్రమాద స్థితిలో ఏలేరు కాలువపై తాత్కాలిక వంతెన
- ఆర్డీఓ సీతారామారావు సమీక్ష

పెద్దాపురం: తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఏటిపట్టు గ్రామాలు భయంగుప్పిట బిక్కుబిక్కుమంటున్నాయి. ఏలేరు ప్రాజెక్ట్ నుంచి 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో, ఏటిపట్టు ప్రాంతాలైన గుడివాడ, జె.తిమ్మాపురం, పులిమేరు, తూర్పుపాకల, జి.రాగంపేట, చంద్రమాంపల్లి, కట్టమూరు, కాండ్రకోట, దివిలి, తాటిపర్తి, ఉలిమేశ్వరం, సిరివాడ, మర్లావ, తిరుపతి, చదలాడ తదితర గ్రామాల రైతులు భయాందోళన చెందుతున్నారు. వరద ఉధృతి కారణంగా ఏలేరు కాలువపై బ్రిటిష్ కాలం నాటి వంతెన 2022 అక్టోబర్‌లో కొట్టుకుపోయింది. దీంతో రైతులు ప్రభుత్వ సహకారంతో తాత్కాలిక వంతెన నిర్మించారు. ప్రస్తుతం అది కూడా ప్రమాదకర పరిస్థితిలో ఉంది. సామర్థ్యానికి మించి వరద ఉధృతికి తాత్కాలిక వంతెన కూడా కొట్టుకుపోయేలా ఉంది. దీంతో స్థానిక రైతులు గండ్లు కొట్టి నీటి ప్రవాహం వంతెనను బలంగా తాకకుండా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఈ వంతెనపై రాకపోకలను నిలిపివేశారు. కట్టమూరు, జె.తిమ్మాపురం, తూర్పుపాకలు, కాట్రావులపల్లి తదితర గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. కట్టమూరు, కాండ్రకోట గ్రామంలో ఏలేరు కాలువపై ఉన్న వంతెనల వద్ద వరద ఉధృతిని ఆర్డీఓ జె సీతారామారావు, ఇరిగేషన్ ఏఈ పాలెపు వీరబాబు, ఎస్సై మౌనికతో కలిసి ఆదివారం పరిశీలించారు.



కాండ్రకోట దబ్బ కాలువ వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

ఏటిగట్టును పరిశీలించిన అధికారులు

జగ్గంపేట: మండలంలో ఏలేరు కాలవగట్టును ఆనుకుని ఉన్న ఇర్రిపాక, మామిడాడ గ్రామాల్లో ఆదివారం రాత్రి అధికారులు పర్యటించారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి వరద నీటిని దిగువకు వదులుతున్న నేపథ్యంలో ఇర్రిపాక, మామిడాడ గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తంగా చేశారు. ఇర్రిపాకలో ఏటిగట్టును ఆనుకుని ఉన్న దేవాలయాలు దెబ్బతినకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ రమేష్ తెలిపారు. ఈ ప్రాంతాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కూడా పరిశీలించారు.